క్లుప్తంగా

ఓగూరికి మంత్రి విశ్వరూప్ అభినందన



విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షునిగా నియమితులైన గోపవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఓగూరి విజయ్‌కుమార్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆయన కుమారుడు శ్రీకాంత్‌లు గురువారం అభినందించారు. యువజన విభాగం అధ్యక్షునిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గృహసారథుల మండల కన్వీనర్ కోటుం లోవరాజు, కోరుకొండ కిరణ్, సంపత్ పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లోనే యూడీసీ ఫలితాలు

యానాం: ఈ నెల 23న జరిగిన అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ) పరీక్ష ఫలితాలను నాలుగు రోజుల్లోపే ప్రకటించి సంచలనం రేకెత్తించారు. బుధవారం అర్ధరాత్రి విడుదల చేసిన ఫలితాల్లో యానాం నుంచి 10 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీఎస్ఎస్ఎం లోవరాజు కనకాల, పేరాబత్తుల వీరబాబు, మహ్మద్ షారూఖ్, రాజు దీవెన, నక్కా చైతన్య, సాయికృష్ణ బందకవి, డి.వీరనాగలక్ష్మి, సాయిసత్య సలాది, మహేష్ ఆచంట, అరుణ ఎస్లావత ఎంపికయ్యారు. యానాం నుంచి ఉద్యోగాలు సాధించిన పదిమంది అభ్యర్థులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: మత్స్య శాఖ ఆధ్వర్యంలో సీఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ శుక్లా ఆవిష్కరించారు. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యం కోసం చేపలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జలవనరుల శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, ఆర్డీవో వసంతరాయుడు, మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహమ్మద్, డీపీవో వి.కృష్ణకుమారి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు ఎస్.మధుసూదన్, వి.శివ శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

తాళ్లరేవు: గాడిమొగ పీహెచ్‌సీ అభివృద్ధికి ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, స్థానికంగా ఉన్న సంస్థల సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత పేర్కొన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన గాడిమొగ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాడిమొగ పీహెచ్‌సీలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలను కమిటీ సభ్యులకు వివరించి వాటి తీర్మానాలను ఆమోదించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యపరచాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, రాయుడు గంగాధర్, సూపర్‌వైజర్ ఇబ్రహీం, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, వైద్యురాలు జయభార్గవి, అనిశెట్టి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ

వ్యక్తి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి దుర్గా వాస్తు నిలయం సమీపంలో గురువారం రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ ఏటిమొగ గ్రామానికి చెందిన మల్లాడి సత్తిబాబు(36) బైక్‌పై యానాం వైపుకు వెళుతుండగా, ఎదురుగా మరొక బైక్‌పై వస్తున్న యువకులు బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సత్తిబాబుకు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సత్తిబాబు మృతి చెందాడు. కర్రి ధనశేఖర్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి గాయాలవడంతో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన సత్తిబాబుకు భార్య, కుమార్తె ఉన్నారు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల పాక దగ్ధం

ఉప్పలగుప్తం: ఓ రైతు పశువుల పాకలో దోమలను నివారించేందుకు పొగ పెడితే గాలికి మంటలు చెలరేగి పశువుల పాక దగ్ధమైన ఘటన మండలంలోని బొర్రాయిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దోనిపాటి వెంకటేశ్వరరావు అనే రైతు పాయకరావుకోడు సమీపంలో కౌలుకు వరి చేను చేస్తూ ఒక గేదెను పెంచుకుంటున్నాడు. రోజూలానే గురువారం పొలం వద్ద పని ముగించుకుని గేదెను దోమల నుంచి రక్షించడానికి పొగ పెట్టి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంతలో గాలికి మంటలు వ్యాపించి పశువుల పాక దగ్ధమైంది. పాకలో ఉండిపోయిన గేదె తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు హుటాహుటీన మంటలను అదుపుచేసి గేదెను బయటకు తీసుకొచ్చారు.



పాగాకులంకలో నీట మునిగిన ప్రాంతం



మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు



బోడసకుర్రు మత్స్యకార కాలనీలోకి చేరిన వరద నీరు

వరద గోదావరి

- గంట గంటకూ పెరుగుతున్న ఉధృతి
- వరద హెచ్చరికలతో ఆందోళనలో లంక ప్రజలు

ఐ.పోలవరం: గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు వల్ల గోదావరి పొంగి ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరగడంతో వృద్ధ గౌతమీలోనూ గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గంట గంటకూ గోదావరి నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. దీంతో స్థానిక అధికారులు అప్రమత్తమై వరద హెచ్చరికలు జారీ చేయడంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఐ.పోలవరం మండలంలో పశువుల్లంక, మురమళ్ల, కేశనకుర్రు, కొమరగిరి, ఎదుర్లంక, పాత యింజరం, తిళ్లకుప్ప, జి.మూలపొలం, గోగుల్లంక, గుత్తినదీవి గ్రామాల్లోని లంక గ్రామాల ప్రజలు, మత్స్యకార ప్రాంతాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికే మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఉన్న పుష్కరఘాట్ మెట్ల పైకి వరద నీరు చేరుకుంది. అలాగే పశువుల్లంక, ఎదుర్లంక, అన్నంపల్లి అక్విడెక్టు వద్ద గోదావరి ఉరకలు వేస్తుంది. కేశనకుర్రు పంచాయతీ పరిధి పొగాకులంక, పల్లెగూడెంల్లో రహదారులు, ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుకుంది. అక్కడి ప్రజలు తమ సామాన్లు సర్దుకుని బంధువుల ఇళ్లకు తరలి వెళుతున్నారు. లంక గ్రామాల్లో ఉన్న కూరగాయల తోటల్లో వరద నీరు చేరుకుంది. దీంతో రైతులు లంకల్లో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముంపునకు గురైన 45 ఇళ్లు

అల్లవరం: బోడసకుర్రు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న మత్స్యకార కాలనీ వరద నీటిలో చిక్కుకుంది. గురువారం సాయంత్రానికి వరద కాలనీలోకి చేరడంతో మత్స్యకారులకు చెందిన 45 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణ మోహన్, ఎస్ఐ శ్రీనునాయక్‌లతో కలిసి సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నీట మునిగిన కాలనీని గురువారం పరిశీలించారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున ఎవరూ ఇళ్లల్లో ఉండొద్దని, అందరూ పునరావాస కేంద్రానికి తరలిరావాలని సర్పంచ్ విజయలక్ష్మి సూచించారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి రెండు పడవలను ఏర్పాటుచేశామని తెలిపారు. గురువారం రాత్రికి వరద ఉధృతి మరింతగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో గర్భిణులు, పిల్లలు, వృద్ధులను స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలిస్తున్నామని తహసీల్దార్ సాంబశివప్రసాద్ తెలిపారు.

పెరుగుతున్న గోదావరి వరద

ముమ్మిడివరం: గోదావరి వరద ఉధృతి పెరగడంతో గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠానేల్లంక, గేదిల్లంక, చింతపల్లిలంక, చింతావానిరేవు తదితర లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుతుంది. దీంతో ప్రజలు తమ వ్యవసాయ ఉత్పత్తులను, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. వరద ఉధృతికి లంక గ్రామాల్లో పంట భూములు కోతకు గురవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోలు రూమ్ కొనసాగుతుంది.

చేసేసిన పనులకు మళ్లీ బిల్లులా...?

- బదిలీ అయిన ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్సీతో సహా పాలక పక్ష కౌన్సిలర్ల డిమాండ్



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: చేసేసిన అభివృద్ధి పనులకు మళ్లీ బిల్లులా...? పూర్తయిన ఆ పనులకు ఇప్పుడు అంచనాలు పెట్టి టెండర్లు ఆమోదించాలని అజెండాలో కౌన్సిల్ తీర్మానాల కోసం ప్రయత్నాలా...? ఎంత కాలం కౌన్సిలర్లను ఇలా మోసం చేస్తారంటూ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో సహా పాలక పక్ష కౌన్సిలర్లు ఇంజినీరింగ్ విభాగంపై విరుచుకుపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన గురువారం ఉదయం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అజెండాలోని 33వ అంశం చర్చకు రాగానే గతంలో చేసేసిన పలు పనులకు ఇప్పుడు టెండర్లు ఆమోదించాలని కోరడం దారుణమని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అధికారులపై మండిపడ్డారు. రోడ్లకు గుంతలే లేని తన వార్డులో గుంతలకు మరమ్మతులంటూ రూ.1.25 లక్షలకు ఆమోదం తెలపమనడమేంటని 16వ వార్డు కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించారు. గతంలో టెండర్లు ఖరారైన పనులను కాంట్రాక్టర్లను పిలిచి పాత ధరలకు పనులు చేయించాలని లేదా వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిలర్లు రాజేష్, బులినాని ధ్వజమెత్తారు. ఇటీవల మున్సిపాలిటీ నుంచి బదిలీ అయిన డీఈఈ అప్పలరాజు, ఏఈ వెంకటేశ్వరరావులు ఇన్ని తప్పిదాలు చేసి వెళ్లిపోతే ఎందుకు క్షమించాలని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. వచ్చే కౌన్సిల్ సమావేశానికి వారు హాజరై ఈ తప్పిదాలపై కౌన్సిల్‌కు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, వాసర్ల లక్ష్మి, సుంకర పార్వతి, దొంగ నాగ సుధారాణి, బండారు గోవిందు మాట్లాడారు.

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టండి

కౌన్సిల్‌లో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: లేఅవుట్‌లు ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో గురువారం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అజెండాలోని అంశాలను వివరిస్తుండగా ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ పంట బోదెలను, మురుగునీటి కాలువలను ఆక్రమించి అనధికార లేఅవుట్లు వేస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. బైపాస్‌రోడ్డును ఆనుకుని కొండాలమ్మ చింత, నడిమిలంక, ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అనధికార లేఅవుట్లు వేశారన్నారు. దీనిపై చైర్మన్ స్పందించి ఎక్కడైతే అనధికార లేఅవుట్ల వద్ద ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. 15వ వార్డులో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారై దహన సంస్కారాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ మాదాల నాగసత్య మంగా కుమారి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని జేఈ సత్యనారాయణకు సూచించారు. సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమ సుందరి, కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హబ్ సెంటర్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వసంతలక్ష్మి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోక్‌మాన్, ఏబీఏ స్‌డీఈ నాగబాబు, ఆనంద్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: సమాజంలోని పేదలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో మెగా సేవా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్ క్లబ్‌ల ద్వారా ఏడుగురు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురికి వెట్ గ్రైండర్లను ఎమ్మెల్యే పొన్నాడ అందజేశారు. రిటైర్డ్ మాస్టర్ దంగేటి వెంకటరమణ కుటుంబ సభ్యులు ఐసీయూ బెడ్, వీల్‌చైర్‌లను బహూకరించారు. తాళ్లరేవు శ్మశానవాటిక అభివృద్ధికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, గోవిందకుమార్, స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి పాల్గొన్నారు.

మండల యూత్ అధ్యక్షుడిగా శ్యామ్

అల్లవరం: అల్లవరం మండలం వైఎస్సార్‌సీపీ యూత్ విభాగ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బళ్ల శ్యామ్ ఎన్నికయ్యారు. అమలాపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన యూత్ అధ్యక్షుడు శ్యామ్‌ని గురువారం మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పినిపే శ్రీకాంత్, నాతి శ్రీనివాసరావు, పరమట శ్రీను తదితరులు శ్యామ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

నానిరాజుకు ప్రముఖుల పరామర్శ



నానిరాజును పరామర్శిస్తున్న ఎంపీ చింతా అనురాధ

అమలాపురం టౌన్: సోదరుడి వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, ముమ్మిడివరం ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డే రఘురామ్, కోనసీమ ఆక్వా సంఘం అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, అల్లూరి రమేష్‌రాజు గురువారం పరామర్శించారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ

పట్టణంలోని శాయమ్మ పేటలో ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మృతి చెందిన బీర చిరంజీవి చిత్రపటానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. చిరంజీవి కుటుంబాన్ని మంత్రి గురువారం పరామర్శించారు.

సీఎం జగన్ సంక్షేమ ప్రదాత



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాతగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ బర్రే సీతారత్నం అధ్యక్షతన బెండమూర్లంక సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ లబ్ధిదారులకే నేరుగా సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజారిటీని అందించి వైఎస్ జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బాపూజీ, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, ఎంపీటీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు జి.వేమవరం పంచాయతీ పరిధిలో 504 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గురువారం జి.వేమవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పి.సూరిబాబు అధ్యక్షతన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనుపమ, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, రామాంజనేయులు, యర్రంనీడి అప్పారావు, గంగాధర్, దెయ్యాల సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం



దంగేటి దోలామణి

అమలాపురం రూరల్: అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బండారులంకకు చెందిన దంగేటి డోలామణి, పాలక వర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అమలాపురం క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని మండల అధ్యక్షుడు గోవిందశెట్టి తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

సాయిబాబా విగ్రహం ఏర్పాటు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామంలో మహిళలంతా కలిసి సాయిబాబా విగ్రహాన్ని నెలకొల్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేస్తామని భక్తులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ ప్రకాశం బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరించిన మున్సిపల్ కమిషనర్ ప్రకాశం

యానాం: యానాం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా పీసీఎస్(పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్) అధికారి అరుల్ ప్రకాశం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మున్సిపల్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో అభినందించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. యానాం మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ఆదర్శ యానాంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ప్రకాశం పేర్కొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

యానాం: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను నిరసిస్తూ యానాం, తాళ్లరేవు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు యానాంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ నేతృత్వం వహించారు. పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల మీదుగా ఆర్ఏఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు దావీదు, విజయకుమార్, డి.ప్రసాద్, పి.రాజబాబు, మల్లాడి సత్తిబాబు, దయ పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తాం

ఐ.పోలవరం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇరిగేషన్ ఈఈ కె.బులిరాజు అన్నారు. మండలంలో ఇరిగేషన్ ఈఈ బులిరాజు, డీఈ బి.శ్రీనివాసరావు, ఏఈ శివరామకృష్ణ, వ్యవసాయ అధికారి వాణిలతో కలిసి ఆయన వివిధ గ్రామాల్లో పర్యటించారు. జి.వేమవరం, కొమరగిరి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌బీకేలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఇరిగేషన్ ఈఈ కె.బులిరాజు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగు చేపట్టాలని సూచించారు.